
# పెళ్లికోసం

టి. సుశీలాదేవి




'ఇదేమిటి ? ఎం ఎస్సి అయ్యేదాకా మా అమ్మాయికి పెళ్లి చెయ్యము' అని అంత పట్టుదలగా వుండిన మీ అమ్మా, నాన్నా గబుక్కున శుభ లేఖలు పంపించేశారేం' అంటూ అడిగాను రేణుని.

'ఏం ఆశ్చర్యంగా వుందా ?' తాపీగా అడిగింది రేణుక

'ఆశ్చర్యమా — అంతకన్నా మించిందేదయినా వుంటే చెప్పు' నా గొంతుకలో ఆశ్చర్యం యింకా పోలేదు. ఇది కలకాదుకదా అనిపిస్తూవుంది నాకు.

అప్పుడే సంజ వేళయింది పెళ్లి పందిరంతా నియాన్ లైట్ల వెలుగులో అద్భుతంగా మెరిసి పోతోంది గంట ముందుగా దిగిన వియ్యాలవారిని విడిదిలో దించి వాళ్ల అవసరాలను గమనించటానికి అటూ యిటూ తిరుగుతున్నారు ఆడా మగా అంతా. మేడమీదినుండి చూస్తుంటే మాయా బజారులా వుంది ఆ పందిట్లో డాబా పిట్టగోడ మీద కూచున్నాం నేనూ, పెళ్లికూతురు రేణుక. పెళ్లికూతురి అలంకరణ అంతా పూర్తయింది. నన్ను దానికి తోడుగా కూచోబెట్టి అందరూ క్రిందికి దిగి వెళ్లిపోయారు. ఆ మధ్యాహ్నం బండి దిగి వచ్చిం దగ్గరినుంచి నాకు రేణుక ఒంటరిగా దొరక లేదు. దొరికిన యీ కొన్ని క్షణాల్లో నా అను మానం నివారించుకోవాలన్న తాపత్రయం.

మౌనంగా ఆకాశంలోని నక్షత్రాలకేసి చూస్తున్న రేణుకని చూస్తూంటే నాకు లెక్క లేనన్ని అనుమానాలు కలిగాయి. అదీ నేను ఒక్క రోజే పుట్టాం. ఎదురెదురు యిళ్లే అయినా యిద్దరం కలిసి అక్కడో, యిక్కడో ఒకటిగానే కలిసి ఆడుకున్నాం, పాడుకున్నాం ఒకే స్కూల్లో చదువుకున్నాం. శరీరాలు రెండే అయినా ఒకటే దృష్టి, ఒకటే భావం, ఒకే మనసుగా మెలిగాం. స్కూలుఫైనల్ పాసుకావటంతో మా యిద్దరి దారులూ వేరయ్యాయి. నాకు పెళ్లి ప్రయత్నాలు జరిగాయి. రేణుకు కాలేజి జీవితం ప్రారంభ మయింది. నేను కాపురానికి వెళ్లిపోయినా మా స్నేహం చెదరలేదు. అప్పుడప్పుడు పుట్టింటికి వచ్చి నపుడు విడువకుండా కబుర్లు చెప్పుకునేవాళ్లం. 'మా రేణుకి పెళ్లి ఎప్పుడండీ పిన్నిగారూ' అని అడిగేదాన్ని నవ్వుతూ. 'ఏం పెళ్లిలెద్దూ. మా అమ్మాయిని చక్కగా చదివించుకుంటున్నాం' అనేది ఆవిడ. ఇలా చూస్తూండగానే రేణు బి. ఎస్సి. పాస్ అయింది. 'ఇప్పుడయినా పెళ్లి చేస్తారా మా రేణుకి' అన్న నా మాటకి వాళ్లమ్మకి ఎందుకు కోపం వచ్చిందో నాకు తెలియదు. 'ఏం పెళ్లో పెళ్లో అని తెగ కలవరిస్తున్నావూ. చేసుకున్నావుగా నువ్వు. చాలలేదూ. దాన్ని ఆ రొంపిలోకి లాగాలని వుందా. రేణుని ఎం. ఎస్సి. చదివించాలను కుంటున్నాం. మన యిళ్లలో ఎవరున్నారే ఆమాత్రం చదువచ్చిన వాళ్లు. అంతంత చదువు అది చదువుతుందంటే మాకెంత గొప్పగావుందో

# పెళ్ళికోసం

తెలుసా ? ఎటొచ్చీ వూళ్ళోవాళ్ళ మాత్రం కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు' అని చేతులు తిప్పు కుంటూ వెళ్ళిపోయింది. ఆ మాటలు సూటిగా నన్నే అన్నట్లున్నాయి. నా ముఖం అవమానంతో ఎర్రబడిపోయింది. రేణు వైపు చూశాను అదేం మాటాడలేదుగాని నిర్లిప్తంగా ఒక్క నవ్వు నవ్వి వూరుకుంది. వాళ్లమ్మ అన్న మాటలకి నన్ను అనునయిస్తుందనుకున్న రేణు మాట్లాడక పోవడంతో చరచరా వెళ్లిపోయాను యింటికి. ఆ రాత్రే మా మామగారికి ఒంట్లో బావుండలేదని నన్ను తీసికెళ్లడానికి మా మరిది రావడంతో రేణుకు వెడుతున్నట్టయినా చెప్పే సావకాశం లేక తెల్లారు ఝాము బండికి వెళ్ళిపోయాను. వెళ్లిన నెలన్నరకు వచ్చిన శుభలేఖ నన్ను ఆనందంతోపాటు ఆశ్చర్యం తోనూ ముంచింది. శుభలేఖతోపాటు రేణు ఉత్తరం కూడా వ్రాసింది. ఎన్నో విశేషాలుంటాయి అను కుంటూ తీసిన ఉత్తరంలో ఏ కోపమూ పెట్టుకో కుండా పెళ్లికి తప్పక రావలసిందని సమక్షంలోనే విశేషాలు తెలుపగలనని వ్రాసింది. పెళ్లి చూడాలన్న ఆశకన్న యిది యింత త్వరలో ఎలా సంభవం అన్న కుతూహలమేనాలో అంతులేనిఆరాటాన్నికలిగించింది

వచ్చినప్పటి నుంచి రేణు వంటరిగా దొరకలేదే అని నేను బాధపడుతుంటే తీరా దొరికిన యీ కొన్ని క్షణాలు చుక్కలు చూస్తూ గడిపేస్తోందే అని అంతులేని కోపం వచ్చింది రేణు మీద ఎలా సంభ వించింది అన్న నా ప్రశ్నకి అది చెప్పిన జవాబు యిది. 'మొదట్లో నాకు చదవాలనే వుండేది. బాగా చదివేదాన్ని బి. యస్‌సి చదువుతున్నపుడే నాకు పెళ్లి మీదికి దృష్టి పోయింది. అలా పోకుండా వుండటానికి నేనేం చిన్న పిల్లనా. ఇరవై రెండేళ్లు నాకు. ఆడపిల్ల మనసులో కోరికలు టీన్ ఏజ్‌లోనే పుట్టుకొస్తాయి కదా. తెలిసీ, తెలియని ఆనందం, ఆశ, అనుభూతి ఏవేవో కోరుకుంటుంది హృదయం అప్పుడు. సరిగ్గా ఆ వయసులో పెళ్ళయిపోయింది గనుక నీకేమీ అనిపించివుండదు. ఒక విధంగా బి యస్‌సి లో కొచ్చేదాకా చదువుమీదున్న శ్రద్ధ చేత నాకూ ఏమీ ఆటంకం లేకపోయింది. తరువాత తరువాత మాత్రం కొత్త భావాలు నా మనసులో చోటు చేసుకోసాగాయి. అక్కడక్కడా జరుగుతున్న పెళ్లిళ్లకు హాజరు కావటంతో ఆ పెళ్లికొడుకూ, పెళ్లికూతుర్ల కొంటె చూపులు, కాళ్ళని ఒకరొకరు తొక్కడం, పెళ్లి కొచ్చిన అబ్బాయిలు అమ్మాయిలని టీజ్ చేయటం, శోభనం పెళ్లి కూతురు, పరాచికాలు యివన్నీ క్రమంగా నా మన సులో చోటు చేసుకున్నాయి. ఒక్కవారం రోజులు తిరక్కముందే నిన్ను చూడాలని మీ ఆయన రావటం. ఆ రోజంతా నీవు నా కంటికీ కనిపించక పోవటం. నాలో ఏవేవో ఆలోచనలు రేపేవి. ఇంకా చెప్పాలంటే రాత్రిళ్లు ఒక్కదాన్నే గదిలో కూచుని ఒంటరిగా చదువుకుంటుంటే ప్రక్క గదిలోంచి అన్నా వదినల సరాగం అనుకోకుండానే నా చెవుల్లో దూరేది. గాజుల గలగలలు, వదిన అందకుండా తప్పుకోటం. అన్నయ్య బ్రతిమాలటం నవ్వులు, ముద్దులు నిట్టూర్పులు అన్నీ వినిపించేవి. ఇక చదువుమీదికి మనసు పోయేదికాదు. వదిన అసలు నాకన్నా రెండు, మూడేళ్ళు చిన్నదై వుంటుంది. అయినా నాలో లేని పరిపూర్ణత్వం అమెలో తొణికిస లాడేది ఉదయం ఎర్రబడ్డ నా కళ్ళు చూస్తే వదిన ఏమనేదో తెలుసా ? పెళ్ళయినా అయివుంటే యిలా ఎర్రబడ్డ కళ్ళని చూసి ఎంత హాస్యాలు పట్టించేదాన్నో. ఇప్పుడు మాత్రం నిన్ను చూసి జాలి పడుతున్నాను రేణూ. నీ అందం, యవ్వనం, నిరీక్షణ ఎంతసేపూ ఆ చదువు కోసమే కరిగిపోతూంటే ఎప్పటికయినా పెళ్లి చేసుకుంటావు గాని ఆలోగా యిప్పుడు రేగే కోరికలు చచ్చిపోతాయి. ఆలోచనల తోనే అనుభూతులు అణగారిపోయి వుంటాయి. ఆకలి వేసి వేసి అది చచ్చిపోయాక అన్నం తింటే ఎలా వుంటుందో యిదీ అంతే. వదిన నన్ను హేళన చేయటానికి అనడంలేదని, ఆవిడ మాటలు నిజమనీ నాకు తెలుసు. కాని ఏం చేయను ? ఎంతసేపూ అమ్మా నాన్నలకు నన్ను అందరికన్న మిన్నగా చదివించాలని తప్ప పెళ్లి చేయాలన్న తలంపు లేదు. డిగ్రీ తరువాత డిగ్రీ సంపాదిస్తోంది కూతురు అన్న గర్వం తప్పితే వాటితోపాటు వయసు పెరుగుతోంది అన్న గుర్తింపే లేదు అమ్మకు. ఇంకొక్క మాట చెప్పనా సుశీ నీ దగ్గర నాకు దాపరిక మెందుకు. అన్న వదినల సరసం వినలేక గదిలోంచి బయటకు వస్తే ఏం చూడాల్సివస్తుందో తెలుసా. విడిగా పడక లేను కుంటారేగాని అమ్మా, నాన్నా ఒక్క పడకలోనే వుంటారు. ఒక్కోసారి దోమతెర లోపల వారి పెనుగులాట కూడా కనిపించేది నాకు. అప్పుడెలా వుంటుందో ఒకసారి ఆలోచించు. ఏభై ఏళ్ళ వయ సులో వాళ్ళకున్న కోరిక పెళ్ళీడు వచ్చిన నాకూ వుంటుందని వాళ్ళు ఎప్పుడు తెలుసుకుంటారు చెప్పు. అందుకని ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేశాను. నా ఆలోచన చాలా చీప్ అనుకో. అయినా నాకు కాకుండా నా చదువుకు విలువ యిచ్చి గర్వం పెంచుకుంటున్న మా అమ్మా నాన్నకు నా విషయం తెలియడానికి యింతకన్న మార్గం లేదు' అంటూ దీర్ఘంగా నిట్టూర్చింది రేణు. అంత వరకూ దాని బదులుగా నేను చుక్కల్లోకి చూస్తూ 'ఊ' 'ఆ' అనకుండా కూచున్న నేను అంతటితో రేణు ఆపేయటంతో ఉలిక్కిపడ్డాను 'అందుకని నువ్వు, నువ్వు, ఇంత చదివినదానివి, ఇంత వయసు వచ్చినదానివి వాళ్ల దగ్గరకెళ్లి, 'అమ్మా నేనీ తాపము భరించలేకున్నాను నాకు పెళ్లి చేయండీ' అని అడిగేశావా సిగ్గూ ఎగ్గూ లేకుండా. అబ్బబ్బా ఎలా అడిగేవే బాబూ నాకు సిగ్గేస్తోందికదే తల్చు కుంటూంటేనే వాళ్ళు ఎంతగా నీ పెళ్లి విషయం పట్టించుకోకపోలేమాత్రం, చదువుకే నిన్ను అంకితం చేస్తూ నీ కోరికలని గమనించకపోతే మాత్రం నోరు తెరిచి ఎలా అడిగేవే' దాని భుజాలు పట్టుకుని వూపేస్తూ అడిగాను అటువంటి పరిస్థితి వస్తే ఎలా వుండివుంటుందో, ఆ సన్నివేశం ఎంత అసహ్యంగా వుండివుంటుందో అని మనసు మధన పడింది జవాబు చెప్పలేదు రేణు. చిన్న నవ్వు నవ్వుతూ జాకెట్లోంచి చిన్న కవరు తీసింది అందు లోంచి చిన్న ఉత్తర మొకటి తీసి యిచ్చింది. ఇప్పుడే చిన్న పనుంది వెళ్లివస్తాను ఈలోగా యిది చదివేసి చింపిపారేయి అంటూ నా కేసి చూడకుండా డాబా దిగి పోయింది ముప్పిరిగొంటున్న భావాలతో కుతూహలంతో కాగితం తెరిచి చదవసాగేను

'డియర్ రేణూ !

ఇంకా ఎన్నిరోజులు ఈ నిరీక్షణ. మీవాళ్ళు ఎలాగూ యిప్పట్లో పెళ్లి చేసేట్లు లేరు ఇంకో మూడేళ్లు. కాక ఆరేళ్లు. నాకంత ఓర్పు లేదు ఆ తరువాతయినా కులంగానివాడితో పెళ్ళేమిటని మీవాళ్ళు గొడవచేస్తే మనిద్దరి పెళ్లి జరగక పోవచ్చు నన్ను తప్ప మరొకర్ని చేసుకోనని నీవెంత నచ్చజెప్పినా నాకేమో భయంగానే వుంది. అంచేత నాకొక్కటే ఉపాయం తోస్తోంది. నేను రెండు నెలలు ట్రెయినింగ్‌కు బాపట్ల వెడుతున్నాను రాగానే రిజిస్ట్రారు ఆఫీసులో మన పెళ్లి. నీవు సుముఖురాలివేనని నాకు తెలుసు నోరు తెరిచి నీవు చెప్పకపోయినా నీ కళ్ళు అన్ని భావాలు నకు తెలిపేస్తాయి. ఈ విషయం యింట్లో తెలియనివ్వకు. మన ప్లాన్ చెడిపోతుంది. ఏకంగా పెళ్ళయ్యాక మీవాళ్ల కాళ్లకి దండం పెట్టేద్దాం రేపే నా ప్రయాణం. రాగానే మన పెళ్లి. మరిచిపోకు.

నీ వాడు,

'రాజు'

అక్షరాలు పట్టి పట్టి వ్రాసినట్టు అనిపించినా సరిగ్గా చూసిన నా కళ్లకి కొన్ని అక్షరాలు రేణు చేతి వ్రాతని పట్టించేశాయి. 'అమ్మ దొంగా' అను కుంటూ రేణుని అంత త్వరగా పెళ్లికూతుర్ని చేసిన ఆ ఉత్తరాన్ని చింపను మనసు రాక జాకెట్లో దోపు కుంటూ రేణుకోసం పరుగుతీశాను.

